

సోమశిలలో 48.406 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం సాయంత్రానికి 48.406 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 14,460 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,220
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,723
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,925
నవర (8 గ్రాములు)	రూ.55,400

గరిష్టం/కనిష్టం
38.1 /28.5

వాతావరణం

జిల్లాలో వాతావరణం గురువారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ బుధవారం 43 శాతంగా నమోదైంది.

గంగమ్మ ఒడిలోకి పార్వతీ తనయుడు

విక్రమసింహపురి గణేశ్ ఉత్సవ సమితి పిలుపు మేరకు వినాయక నిమజ్జనోత్సవం నెల్లూరు స్వర్ణాల చెరువులోని గణేశ్ ఘాట్ వద్ద బుధవారం కోలాహలంగా జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పార్వతీతనయుల ప్రతిమలు గంగమ్మ ఒడిలో సేదతీరాయి.



భక్తిశ్రద్ధలతో గంగమ్మకు హారతులు



గంగమ్మ ఒడిలోకి బొజ్జ గణపయ్య



గణేశ్ నిమజ్జనోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

వరద బాధితులకు రూ.10 లక్షల విరాళం



కావలి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కావలి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రూ.10 లక్షలు విరాళాన్ని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బుధవారం అందజేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నగదు చెక్‌ను అందించారు.

గంధం దంచేందుకు బారులుతీరిన మహిళలు



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండల కేంద్రంలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో జరుగుతున్న 251వ గంధ మహోత్సవానికి బుధవారం గంధం దంచే కార్యక్రమం ప్రారంభమైంది. దొరసానమ్మ గంధాన్ని దంచేందుకు మహిళలు భారీ సంఖ్యలో మహల్ వద్దకు చేరుకున్నారు. గంధం దంచేందుకు మహిళలు పోటీ పడ్డారు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, సీఐలు వేమారెడ్డి, గంగాధర్. ఏఎస్‌పేట ఎస్సై సైదులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వీఎస్‌ఎస్‌ల పేరుతో దోపిడీ

అడవిలో జరిగే అవినీతి కదా ఎవరికి తెలుస్తుందిలే అనే ధీమా కావచ్చు. తెలిసినా ఏముందిలే... తాము తిన్న సొమ్ములో కొంత పడేస్తే నోరు ఎత్తరులే అనే ధైర్యం కావచ్చు... వన సంరక్షణ పేరుతో మొక్కల పెంపకంలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోంది. చేతికి మట్టి అంటకుండా ఓ అధికారే ఈ తంతుకు పాల్పడుతున్నారు.



- పేరుకే వన సంరక్షణ సమితులు
- పెత్తనం అంతా అధికారిదే
- మొక్కల పెంపకంలో వేళ్లూనుకున్న అవినీతి
- రూ.లక్షల్లో నిధుల స్వాహా యత్నం
- విరువూరు, కనియంపాడు వీఎస్‌ఎస్‌ల్లో ఇదీ తంతు

ఉదయగిరి/వరికుంటపాడు: కేంద్ర ప్రభుత్వం అటవీ విస్తీర్ణం పెంచే యోచనలో భాగంగా సామాజిక వనాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధులు ఉపయోగించి ప్రభుత్వ బంజరు భూముల్లో వనసంరక్షణ సమితుల ఆధ్వర్యంలో మొక్కలు నాటి.. వాటి సంరక్షణతో పాటు దానిపై వచ్చే ఆదాయం కూడా వీఎస్‌ఎస్ కమిటీలే తీసుకుంటాయి. పర్యవేక్షణ మాత్రం అటవీ అధికారులు చేస్తారు. కొంతమంది అధికారులు ఇదే తమకు అనుకూలంగా మార్చుకొని వీఎస్‌ఎస్ కమిటీలను డమ్మీలుగా మార్చి పనులు అన్నీ వారే చేసుకొని అవినీతికి పాల్పడుతున్నారు. ఉదయగిరి రేంజ్ స్థాయిలో ఓ అధికారి, జిల్లా స్థాయి ఉన్నతాధికారిని మేనేజ్ చేసి నిధులు దిగమింగుతున్నారు. ఈ తంతు వరికుంటపాడు అటవీ బీట్ ఏరియాలోని కొత్తపేట, కనియంపాడు, విరువూరుల్లో మొక్కల పెంపకం(ప్లాంటేషన్)లో సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరికుంటపాడు, దుత్తలూరు మండలాల సరిహద్దు ప్రాంతం కొత్తపేట ఏరియాలో 116 హెక్టార్ల ప్రభుత్వ భూముల్లో ప్రత్యామ్నాయ వనీకరణ



కనియంపాడు ఏరియాలో మొక్కల ప్లాంటేషన్

పథకానికి సుమారు రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో మొక్కలు నాటే కార్యక్రమం ఉదయగిరి అటవీ అధికారులు ప్రారంభించారు. ఈ పనులు కనియంపాడు వన సంరక్షణ సమితి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరగాలి. కానీ వారిని డమ్మీ చేసి పనులు మొత్తం అధికారులే చేసుకుంటూ కమిటీలకు మొండిచేయి చూపిస్తున్నారు. ఈ కమిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్లను తమకు అనుకూలంగా మార్చుకొని వారి ఖాతాల నుంచి నగదు తీసుకుంటున్నారు. అధికారులు తెలివిగా తమకు ఏమీ సంబంధం లేనట్లు, అంతా వీఎస్‌ఎస్‌ల ద్వారా జరిగినట్లు భ్రమింపజేస్తున్నారు. పైకి పారదర్శకంగా కనిపిస్తున్నా లోగుట్టు వేరే విధంగా ఉంటోంది.

ఇష్టారాజ్యంగా పనులు

పనుల్లో నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భూమిలో అరకొరగా జంగిల్ ఉన్నప్పటికీ ఎక్కువగా ఉన్నట్లు రికార్డుల్లో




ప్లాంటేషన్‌లో ఎండిపోతున్న మొక్కలు

నమోదు చేసి నిధుల స్వాహాకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఆదే విధంగా మొక్క నాటేందుకు 30 సెం.మీ లోతు, వెడల్పుతో గుంతలు తీయాల్సి ఉన్నా పైపైనే గుంతలు తీసి నాటుతున్నారు. దీంతో మొక్కలు ఏపుగా పెరిగే అవకాశం ఉండదు. ఎండబెట్టకు మొక్క చనిపోయే ప్రమాదం ఉంది. మొక్కలు నాటేటప్పుడు రసాయనిక ఎరువులు (డీఏపీ, యూరియా, ఫాస్ఫరస్) గుంతల్లో వేసి మట్టి కప్పివేయాలి. కానీ ఎరువులు వేయడం లేదు. అన్నీ వేసినట్లుగా ఎం.బుక్‌ల్లో నమోదు చేసుకొని పెద్ద మొత్తంలో నిధులు స్వాహాకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా వరికుంటపాడు మండలం విరువూరులో కూడా 40 హెక్టార్లలో మొక్కలు పెంచేందుకు మరో రూ.30 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులు దాదాపు పూర్తి చేశారు. ఇక్కడ కూడా ఇదే తరహా తంతు సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీఎస్‌ఎస్ కమిటీలు తాము పని చేస్తామని అడిగితే 40 శాతం లంచం రూపంలో కమీషన్ ఇవ్వాలని అధికారులు డిమాండ్ చేస్తున్నారని తెలుస్తోంది. దీంతో తాము పనులు చేయలేకపోతున్నట్లు కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి రేంజ్ పరిధిలోని అన్ని వీఎస్‌ఎస్‌లలో ఇదే తంతు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతం నుంచి రేంజ్ పరిధిలో జరిగిన వివిధ పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ జరిపితే అవినీతి గుట్టు రట్టవుతుందని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాలపై వరికుంటపాడు బీట్ అధికారి రసూల్‌ను అడగగా అంతా పై అధికారులు చూసుకుంటారని తెలిపారు. ఎం.బుక్ తాము చేసినా పై అధికారులు ఎలా చెబితే అలా చేస్తామని అన్నారు.

చాకిరీ ఎక్కువ.. శాలరీ తక్కువ!

విద్యార్థులకు ఒత్తిడి లేని, ఆట పాటలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలి. కానీ ఇక్కడ మాత్రం ఒత్తిడితో కూడిన విద్యాబోధన చేయిస్తున్నారు. ఆ పాఠశాలల్లో పనిచేసే వారంతా మహిళలే. అందులో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు. ప్రశ్నిస్తే ఉద్యోగం ఊడుతుందేమోనని భయం. దీంతో చేసేది లేక వెట్టి చాకిరీ చేస్తున్నారు. చాలీచాలని జీతాలతో జీవితాలను కొనసాగిస్తున్న కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం టీచర్లపై ప్రత్యేక కథనం.



- ఒత్తిడి లేని చదువులంటూనే టీచర్లపై పని భారం
- నైట్ డ్యూటీలతో సతమతం
- వార్డెన్ పోస్టులు లేవు.. క్వార్టర్స్ లేవు
- రెగ్యులర్ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు
- ఇదీ కేజీబీవీ ఉద్యోగుల పరిస్థితి

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా, ప్రస్తుత నెల్లూరు జిల్లాలో మొత్తం 44 కేజీబీవీలు ఉన్నాయి. అన్ని కేజీబీవీల్లో 6 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్‌ను కూడా ప్రవేశపెట్టారు. గురుకుల పాఠశాలల మాదిరిగానే కేజీబీవీలు ఉంటాయి. విద్యాలయం, హాస్టల్ కలిపి ఉంటుంది. విద్యావిధానం ప్రకారం టీజీటీ, పీజీటీ పోస్టులు ఉండాలి. 6 నుంచి 8వ తరగతి వరకు టీజీటీలు, 9, 10, ఇంటర్మీడియట్‌కు పీజీటీ పోస్టులు ఉండాలి. ఒక్కో సబ్జెక్టుకు రెండు పోస్టులు ఉండాలి. ఈ విద్యాలయాల్లో మాత్రం విరుద్ధంగా విద్యాబోధన చేయిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ (సీఆర్‌టీ)లు బోధిస్తున్నారు. పీజీటీ సీఆర్‌టీలు కేవలం ఇంటర్ మాత్రమే బోధిస్తున్నారు. దీంతో పాటు తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులు 6 నుంచి ఇంటర్ వరకు ఒక్కొక్కరే బోధిస్తున్నారు. మిగిలిన సబ్జెక్టులు 6 నుంచి 10వ తరగతి వరకు ఒకరే బోధిస్తుండగా ఇంటర్‌కు పీజీటీలు బోధిస్తున్నారు. ఇలా బోధకులపై ఒత్తిడి పెరుగుతోంది. రోజు వారి బోధనా అవర్స్ కూడా పెరిగాయి. విద్యా విధానం ప్రకారం బోధకులను నియమించాలని ఉన్నతాధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

నైట్ డ్యూటీలతో ఇబ్బందులు

కేజీబీవీలో విద్యాలయం, వసతి గృహం ఉంది. కానీ వార్డెన్ పోస్టు మాత్రం ఇవ్వడం లేదు. దీంతో టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు నైట్ డ్యూటీలు చేయాల్సి వస్తోంది. ఉదయం 9 గంటలకు వెళ్లి నైట్ డ్యూటీ చేసుకొని మరుసటి రోజు 11 గంటలకు డ్యూటీ దిగాల్సి వస్తోంది. దీంతో పాటు సెలవు దినాల్లో ప్రత్యేకంగా పగలు షిఫ్ట్, నైట్ సిఫ్ట్ డ్యూటీలు చేయాలి. ఇలా డ్యూటీ చేసి విద్యాబోధన చేయాలంటే మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నామని ఉద్యోగులు చెబుతున్నారు. అదే వార్డెన్ పోస్టు ఉంటే రాత్రి సమయంలో వార్డెనే చూసుకుంటారు. దీంతో పాటు గురుకుల పాఠశాలల్లాగా క్వార్టర్స్ సదుపాయం లేదు. ఇలాంటి సౌకర్యాలు కల్పించకుండా నైట్ డ్యూటీలు వేసి విద్యాబోధన చేయాలంటే కష్టంగా ఉంటుంది. వార్డెన్ పోస్టు ఇవ్వాలని కొన్ని ఏళ్ల నుంచి డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

ఎంటీఎస్ వర్తింపు చేయాలి

ఏళ్ల తరబడి వెట్టి చాకిరీ చేస్తున్నా వారిని పట్టించుకోవడం లేదు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని జీవోలు ఉన్నా అధికారులు వర్తింపజేయడం లేదు. కేజీబీవీలో అందరూ మహిళలే కావడంతో బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోతోంది. అందులో కాంట్రాక్ట్ ఉద్యోగులు కావడంతో ఉన్నాధికారుల బెదిరింపులు ఎక్కువగానే ఉంటాయి. క్యాజువల్ లీవ్‌లు కూడా ఉన్నతాధికారులు చెప్పినట్లే వాడుకోవాలి. ఉద్యోగం వదులుకుంటే బతుకుదెరువు పోతుందేమోనని ఇటు మానుకోలేక, అటు కష్టం చేయలేక నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి.

చాలీచాలని జీతాలు



కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం

కేజీబీవీలో కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రిన్సిపాళ్లకు రూ.33,938, సబ్జెక్టు సీఆర్టీలు, పీఈటీలకు, పీజీటీలకు రూ.26,552 జీతం. అవుట్ సోర్సింగ్ కింద ఏఎన్‌ఎంకు 16,425, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.14,000, ఒకేషనల్, కుకింగ్ డే, నైట్ వాచ్‌మెన్, స్కావెంజర్‌లకు రూ.13,028 జీతం. వీరికి అదనంగా ఎలాంటి అలవెన్స్ లేవు. ఈ జీతాలతో జీవనం సాగించాలంటే కష్టంగా ఉంటుంది. 6 నుంచి ఇంటర్ వరకు బోధించే వారికి ఇచ్చే జీతంతో కుటుంబాలు గడవడ కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర ధరలు, చార్జీలు, ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు, ఇతర ఖర్చులు చూసుకుంటే తిరిగి అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కష్టానికి తగిన ఫలితం లేకుండా పోయిందని నిరుత్సాహంగా ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు

డ్రాప్ అవుట్స్ బాలికల కోసం ఏర్పాటు చేసిన కేజీబీవీలలో ప్రస్తుతం అడ్మిషన్లు దొరకడం కష్టంగా మారింది. అంతా ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. కేజీబీవీలో అడ్మిషన్ కావాలంటే రికమెండేషన్లు పెట్టుకున్నా కుదరని పరిస్థితి. అంతా ఆన్‌లైన్, రోస్టర్ పద్ధతిలో సీట్లు కేటాయిస్తారు. లోకల్, నాన్ లోకల్ విధానంలో సీట్ల భర్తీ ఉంటుంది. అందరూ బాలికలే కావడంతో సెక్యూరిటీ బాగుంటుందనే ఆలోచనతో తల్లిదండ్రులు ఆడ పిల్లలను కేజీబీవీలో చేర్చేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతోపాటు ఆశించిన స్థాయి కంటే ఉత్తమ ఫలితాలు వస్తుండటంతో అడ్మిషన్లకు డిమాండ్ పెరిగింది. దీంతోపాటు ఇంటర్ కూడా ప్రవేశపెట్టడంతో 6వ తరగతికి చేరితే ఇంటర్ వరకు ఇబ్బంది లేకుండా అక్కడే చదువుకుంటారు. విద్యాలయాలకు ఇంత పేరు తీసుకురావడంతో ఉద్యోగులు ఎంత కష్టపడ్డారో దానికి తగిన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

పచ్చ నేతల కబ్జాపర్వం

టీడీపీ అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ నేతలు అవినీతి, అక్రమాలకు తెరలేపారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు, ఇసుక అక్రమ రవాణాతో నిత్యం లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. వెంకటాచలం, కసుమూరు గ్రామాల్లో రూ.2 కోట్ల విలువైన చెరువు భూములను రాత్రికి రాత్రే కబ్జా చేశారు.

- కసుమూరు, వెంకటాచలం గ్రామాల్లో రూ.2 కోట్ల విలువైన భూముల ఆక్రమణ
- చేష్టలుడిన చూస్తున్న అధికారులు
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

వెంకటాచలం: వెంకటాచలంలో జాతీయ రహదారి ఆనుకుని కనుపూరు చెరువు ఉంది. ఈ చెరువు జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో ఇక్కడ అంకణం ధర అక్షరాల రూ.లక్ష పైనే పలుకుతుంది. వ్యాపారానికి అనువుగా ఉంటుందనే ఆలోచనతో టీడీపీ నేతల కన్ను ఈ చెరువుపై పడింది. అనుకున్నదే తడవుగా రాత్రికి రాత్రే జేసీబీతో అర ఎకరం భూమిలో ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించి ఆక్రమణలకు పాల్పడ్డారు. జాతీయ రహదారి ఆనుకుని ఉన్న రూ.50 లక్షలు విలువ చేసే అర ఎకరా కనుపూరు చెరువు భూమిని టీడీపీ నేతలు దర్జాగా కబ్జా చేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయకట్టు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కసుమూరులో రూ.1.50 కోట్ల భూమి ఆక్రమణ

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన మస్తాన్‌వలీ దర్గా కసుమూరు గ్రామంలో ఉంది. కసుమూరులో అంకణం భూమి ధర లక్షల్లో పలుకుతుంది. అయితే దర్గాకు అతి సమీపాన ఉన్న 1.50 ఎకరాల చెరువు పోరంబోకు భూమిపై టీడీపీ నేతల కన్ను పడింది. జేసీబీతో చెట్లను తొలగించి చదును చేయించారు.



కసుమూరులో టీడీపీ నేతలు ఆక్రమించిన విలువైన చెరువు పోరంబోకు భూమి



వెంకటాచలంలో కనుపూరు చెరువును ఆక్రమించి చదును చేసిన దృశ్యం

ఈ భూమిలో గ్రావెల్‌తో లెవల్ చేయించి ప్లాట్లు వేసి సొమ్ము చేసుకునే ఆలోచనలో నేతలు ఉన్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఆక్రమణదారులపై చర్యలేవీ?

రూ.కోట్ల విలువ కలిగిన ప్రభుత్వ భూములను టీడీపీ నేతలు ఆక్రమించిన విషయాన్ని చూసి స్థానికులు విస్తుపోతున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఆక్రమణలు కాకుండా కాపాడుకుంటూ వచ్చిన విలువైన భూములను టీడీపీ నేతలు ఆక్రమించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యులు తలదాచుకునేందుకు సెంటు భూమిలో గుడిసెలు వేస్తే వెంటనే తొలగించే అధికారులు కోట్ల విలువ గల భూమిని దర్జాగా ఆక్రమిస్తే చర్యలు తీసుకోరా అంటూ ప్రశ్నిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని విలువైన ప్రభుత్వ భూమిని టీడీపీ నేతల కబంధహస్తాల్లో నుంచి బయటకు లాగాలని డిమాండ్ చేస్తున్నారు.


ఆక్రమణలు మా దృష్టికి రాలేదు

కనుపూరు చెరువు ఆక్రమణల విషయం మా దృష్టికి రాలేదు. కనుపూరు చెరువును పరిశీలించి, ఆక్రమణలపై విచారణ చేపడతాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చెరువు భూములను ఎవరూ ఆక్రమించకుండా చర్యలు చేపడతాం.

– సుధీర్, ఇరిగేషన్ జేఈ

అర్ధరాత్రి గ్రావెల్ అక్రమ రవాణా

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పోలినాయుడుచెరువు గ్రామ పొలాల్లో నుంచి కొందరు టీడీపీ నేతలు గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలో ఎక్కడా మట్టి, గ్రావెల్ తవ్వకాలకు అనుమతిలేదు. అయితే కొందరు టీడీపీ నాయకుల అండతోనే రాత్రుళ్లు ఇష్టారాజ్యంగా గ్రావెల్ తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మంగళవారం రాత్రి పొలాల్లో నుంచి గ్రావెల్ తరలిస్తున్న విషయం స్థానికులు గమనించారు. పొక్లెయినేతో ట్రాక్టర్లు, టిప్పర్లకు గ్రావెల్ లోడు చేసి సహజ వనరులను కొల్లకొడుతున్నా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. టీడీపీ నాయకుల నుంచి అందుతున్న మామూళ్ల మత్తులో పడి అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అక్రమ రవాణాను అడ్డుకునే ప్రయత్నం చేస్తే గ్రావెల్ మాఫియా బెదిరింపులు, వ్యక్తిగత దూషణలు, దాడులకు దిగుతున్నారని స్థానికులు వాపోతున్నారు. స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పదేపదే గ్రావెల్, మట్టి, ఇసుక అక్రమంగా తరలించేవారిని ఉపేక్షించేదిలేదని చెబుతున్నా, అవి మాటలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. మట్టి, గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా టీడీపీ నేతల కనుసన్నల్లో సాగుతుండటంతో ఎమ్మెల్యే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.



అర్ధరాత్రి పొక్లెయిన్‌తో ట్రాక్టర్‌కు గ్రావెల్ లోడు చేస్తున్న దృశ్యం

పేదరికం, నిరక్షరాస్యత కారణంగా సౌకర్యాలు అందరికీ సమానంగా దక్కడం లేదు. రెండు పూటలా తిండి దొరకని వారెందరో. ఇలాంటి నిరుపేదల కడుపున పుట్టే బిడ్డలను పౌష్టికాహార లోపం వెంటాడుతోంది. దీంతో వయస్సుకు తగిన ఎత్తు, బరువు పెరగడం లేదు. వీరికి జబ్బులు సులభంగా వస్తున్నాయి. ఫలితంగా మానసిక సమస్యలూ తలెత్తుతున్నాయి. ఇలాంటి పసిబిడ్డలకు నెల్లూరులోని పెద్దాస్పత్రిలో గల న్యూట్రిషనల్ రిహాబిలిటేషన్ సెంటర్ (ఎన్నార్సీ) వరంగా మారింది.

పౌష్టికాహార కేంద్రం..
పసిబిడ్డలకు వరం

- ఎత్తు, బరువు తక్కువున్న వారికి ప్రత్యేక ఆహారం
- 14 రోజుల్లో పిల్లల బరువు పెంపే ప్రధాన కర్తవ్యం
- ఆట వస్తువులు, వేడి నీరు, ఏసీ సదుపాయాలు
- గత ప్రభుత్వ హయాంలో ప్రారంభం


బాలికను పరీక్షిస్తున్న న్యూట్రిషియన్, నర్సింగ్ సిబ్బంది

నెల్లూరు(అర్బన్): న్యూట్రిషనల్ రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటుకు గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అడుగులు పడ్డాయి. దీనికి పెద్దాస్పత్రిలోని పాత కంటి విభాగ భవనాన్ని అధికారులు కేటాయించారు. మౌలిక వసతుల కోసం నాటి ప్రభుత్వం రూ.20 లక్షలు, ఎంపీ ల్యాడ్స్ నిధుల ద్వారా అప్పటి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూ.10 లక్షలు, శ్రీసిటీలోని టీహెచ్‌కే కంపెనీ మేనేజ్‌మెంట్ సీఎస్సార్ నిధుల ద్వారా రూ.ఐదు లక్షలను అందించారు. ఈ మొత్తంతో భవనాన్ని ఆధునికీకరించి అన్ని వసతులతో ఈ ఏడాది మార్చి ఐదున ప్రారంభించారు.


వార్డులో ఏర్పాటు చేసిన వసతులు

14 రోజుల పాటు పౌష్టికాహారం

పుట్టిన బిడ్డలు అందరిలాగే ఎదిగి ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండేందుకు ఈ న్యూట్రిషనల్ రిహాబిలిటేషన్ సెంటర్ కృషి చేస్తోంది. 20 బెడ్లతో భవనాన్ని తీర్చిదిద్దారు. ఆర్నెల్ల నుంచి ఐదేళ్లలోపు వయస్సు ఉండి.. బరువు తక్కువున్న పిల్లలు.. వయస్సుకు తగిన ఎత్తులేని పిల్లలను అక్కున చేర్చుకొని పౌష్టికాహారాన్ని 14 రోజుల పాటు అందిస్తారు. ఉదయం పౌష్టికాహారంతో కూడిన టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని సమకూరుస్తారు. పాలు, గుడ్లు, తాజా పండ్లు, పెరుగు, నువ్వులుండలు, వేరుశనగ ముద్దలు, డ్రై ఫ్రూట్స్, బలవర్ధకమైన ప్రొటీన్ మిక్స్ పౌడర్‌ను ఇస్తారు. రక్తహీనతను నివారించేందుకు ఆకుకూరలు, ఐరన్ మాత్రలను అందిస్తున్నారు. రెండు వారాల్లో బిడ్డ బరువును పెంచి ఆరోగ్యంపై తల్లికి అవగాహన కల్పిస్తారు. రోజూ బిడ్డకు రూ.100 చొప్పున 14 రోజులకు రూ.1400ను తల్లి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు.

ప్రత్యేక సౌకర్యాలు

- పిల్లలకు వేడి నీళ్ల కోసం గీజర్‌ను ఏర్పాటు చేశారు. వివిధ రకాల ఆటబొమ్మలను అందుబాటులో ఉంచారు. ఏసీ సౌకర్యాన్నీ కల్పించారు. రోజూ హెచ్‌బీ శాతం (రక్తం), ఇతర పరీక్షలను వైద్యులు చేస్తారు. పిల్లల ఆరోగ్యంలో తేడాలొస్తే వార్డుకు షిఫ్ట్ చేసి వైద్యాన్ని అందిస్తారు.
- ఎన్నార్సీ భవనంలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఇద్దరు న్యూట్రిషియన్ కౌన్సెలర్లు, ముగ్గురు నర్సింగ్ సిబ్బంది, వంట పనివారు, ఒక శానిటేషన్ సిబ్బంది సేవలందిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జన్మించిన పిల్లల్లో తగిన బరువు పెరగని, ఆహార లోపం ఉంటే ఈ కేంద్రంలో చేర్చి ప్రయోజనం పొందవచ్చు.


కేంద్రంలో ఆట వస్తువులు

పిల్లల అడ్మిషన్లు ఇలా..

నెల	సంఖ్య
జనవరి	31
ఫిబ్రవరి	38
మార్చి	30
ఏప్రిల్	32
మే	31
జూన్	27
జూలై	36

వీరందరూ పౌష్టికాహారం పొంది ఎత్తుకు తగిన బరువు పెరిగారు.

సేవలను వినియోగించుకోవాలి



“ అనేక మంది పిల్లలు పౌష్టికాహార లోపంతో తగినంత బరువు లేకుండా పుడుతున్నారు. వీరికి పెద్దాస్పత్రిలో పౌష్టికాహారం, ఆస్పత్రిలో ఉన్నందుకు రోజుకు రూ.100ను ఇస్తాం. దీనికి తల్లుల ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తక జిరాక్స్ కాపీలను ఇస్తే సరిపోతుంది. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఆమని, మెడికల్ ఆఫీసర్

వికసిత్ భారత్‌పై అవగాహన తప్పనిసరి


మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): వికసిత్ భారత్ – 2047పై డాక్టర్లు తగిన అవగాహన పెంచుకొని దానికి అనుగుణంగా ప్రజారోగ్య పరిరక్షణ కార్యక్రమాలను చేపట్టాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. వికసిత్ భారత్‌పై సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో పీహెచ్‌సీ డాక్టర్లకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైద్యులు, వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి వివిధ అంశాలపై నివేదికలను సిద్ధం చేయాలని కోరారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను నిర్వహించారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత, ఎఫ్పీసీ నోడల్ ఆఫీసర్ దయాకర్, డెమో అధికారి కనకరత్నం, డీపీఓ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

ఉలవపాడు: మండల పరిధిలోని మన్నేటికోట శంకర్‌నగర్ కాలనీలో ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడు తుమ్మల కార్తీక్‌ను పోలీసులు కోర్టులో బుధవారం హాజరుపర్చారు. 14 రోజుల రిమాండ్‌ను జడ్జి విధించారని ఎస్సై అంకమ్మ తెలిపారు.

క్లుప్తంగా

నిమజ్జన ఘాట్‌లో ఎస్పీ పరిశీలన


సిబ్బందికి సూచనలిస్తున్న కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని గణేశ్ నిమజ్జన ఘాట్‌ను ఎస్పీ కృష్ణకాంత్ బుధవారం పరిశీలించారు. విగ్రహాల నిమజ్జన నేపథ్యంలో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం తలెత్తకుండా చూడాలని కోరారు. నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ఉత్సవ కమిటీలు సహకరించాలని చెప్పారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, మిద్దె నాగేశ్వరమ్మ, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

వింజమూరు(ఉదయగిరి): అప్పుల బాధ తాళలేక ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వింజమూరులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. గంగమిట్టకు చెందిన కాలేషా (50) కొన్నేళ్లుగా వివిధ వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా దెబ్బతిన్నారు. ఈ క్రమంలో పట్టణంలోని మెయిన్‌బజార్‌లో చెప్పుల దుకాణాన్ని రెండేళ్ల క్రితం నిర్వహించారు. అయితే అందులోనూ నష్టాలు రావడంతో మానసిక వేదనకు గురై మతిస్థిమితం కోల్పోయారు. ఈ తరుణంలో పట్టణంలోని రాఘవేంద్ర ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40



రైతు లాభం బూడిదపాలు

- కొత్తూరులో పూరిల్లు దగ్ధం
- అగ్నికి ఆహుతైన రూ.ఆరు లక్షల నగదు
- మొత్తం రూ.12 లక్షల ఆస్తి నష్టం

కలిగిరి: ఆరుగాలం కష్టపడి సాగుచేసి పొగాకును విక్రయించగా, చేతికొచ్చిన రూ.ఆరు లక్షల నగదు అగ్నిప్రమాదంలో బూడిదవ్వడం ఆ కుటుంబంలో అంతులేని విషాదాన్ని నింపింది. వివరాలు.. వెలగపాడు పంచాయతీ కొత్తూరులో మక్కెన వెంకటేశ్వర్లు, సుశీల దంపతులు నివసిస్తున్నారు. ఈ క్రమంలో గేదెలను మేపుకొనేందుకు పొలానికి ఆయన వెళ్లగా, ఇంటి బయట పనులను భార్య చేసుకోసాగారు. ఈ తరుణంలో ఇంట్లో మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. ఆమె కేకలు విని చుట్టుపక్కల వారు వచ్చేసరికే పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. పొగాకు విక్రయాలకు సంబంధించిన రూ. 3.5 లక్షలను బ్యాంక్ నుంచి మంగళవారం తీసుకొచ్చారు. గతంలో పొగాకు విక్రయాలకు సంబంధించిన రూ.2.5 లక్షల నగదు ఇంట్లో ఉంది. ఈ తరుణంలో ఈ మొత్తం అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలు, ఫర్నిచర్ దగ్ధమయ్యాయి. ఘటనలో మొత్తం రూ.12 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.


కాలిబూడిదైన నగదు


దగ్ధమైన పూరిల్లు

గంధ మహోత్సవానికీ రాజకీయ రంగు..!

అనుమసముద్రంపేట: ఎంతో చరిత్ర కలిగిన హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాకు ప్రస్తుతం రాజకీయ రంగు పులుముకుంది. ఫలితంగా కొన్ని గంటల్లో నిర్వహించాల్సిన దొరసానమ్మ గంధ మహోత్సవం అయోమయంలో పడింది. దర్గా పవిత్రతను కొన్నేళ్లుగా కాపాడుకుంటూ వచ్చిన పీఠాధిపతులు సైతం రాజకీయ రంగు పులుముకోవడంతో ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. వాస్తవానికి 251వ గంధమహోత్సవాన్ని బుధవారం రాత్రి నిర్వహించాల్సి ఉంది. అయితే మాజీ పీఠాధిపతి హఫీజ్‌పాషాతో పాటు దర్గా వంశీయులు ఫయాజ్ అహ్మద్ వర్గాలు తామంటే తామంటూ దర్గా ఈఓకు తమ లేఖలను ఇప్పటికే అందించారు. గతంలో పనిచేసిన దర్గా పీఠాధిపతిని కొన్ని అనివార్య కారణాలతో ఏడాది క్రితం తొలగించి.. దర్గాలో ప్రార్థనలు చేసేందుకే ప్రభుత్వం అనుమతిచ్చింది. దర్గా సైతం రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉంచింది. ఈ క్రమంలో చిన్నగంధ మహోత్సవాన్ని బుధవారం, పెద్ద గంధమహోత్సవాన్ని 22న ప్రారంభించాల్సి ఉంది. ఈ తరుణంలో దర్గాను తమ ఆధీనంలో ఉంచుకోవాలనే ఉద్దేశంతో ఫయాజ్ వర్గం రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెంతకు చేరింది. దీంతో దర్గా గంధమహోత్సవం అయోమయంలో పడింది. గంధాన్ని ఎవరెత్తాలనే అంశం ఇప్పటికీ తేలకపోవడంతో ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, సీఐ, ఎస్సైలు సైతం దర్గా కార్యాలయం వద్దకు చేరుకున్నారు.


ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా

పీహెచ్‌సీ డాక్టర్ల ఆందోళన

- నల్ల బ్యాడ్జీలతో నిరసన
- జీఓ నంబర్ 85ను రద్దు చేయాలని డిమాండ్

నెల్లూరు(అర్బన్): పీజీ కోర్సులు చేసే అవకాశాన్ని తగ్గించే జీఓ నంబర్ 85ను రద్దు చేయాలని, టైమ్ బౌండ్ ప్రమోషన్లు, అలవెన్స్‌లను ఇవ్వాలని కోరుతూ అన్ని పీహెచ్‌సీల్లో డాక్టర్లు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ విధులకు మంగళవారం హాజరయ్యారు. ఇందులో భాగంగా ప్రభుత్వ తీరును నిరసిస్తూ నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద పలువురు డాక్టర్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డాక్టర్ల సంఘ అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ప్రకారం తమ మూడేళ్ల సర్వీస్‌కు అర్థం లేకుండా పోయిందన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలను ఫణంగా పెట్టి రోగులకు సేవలందించామని గుర్తుచేశారు. అయినా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవలను ప్రభావితం చేసేలా జీఓను విడుదల చేయడం అన్యాయమని చెప్పారు. అలాగే డాక్టర్లకు నిర్దిష్ట సమయానికి ఉద్యోగోన్నతులను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలా కల్పించకపోతే అనేక పోస్టులు ఖాళీగా ఉండి రోగులకు సేవలందవని పేర్కొన్నారు. డాక్టర్లకు రావాల్సిన అలవెన్స్‌లను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. తమ డిమాండ్లను అంగీకరించేంత వరకు రోజువారీ నిరసనలు, ఆందోళనలను చేస్తామని స్పష్టం చేశారు.


డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద పీహెచ్‌సీల డాక్టర్ల ఆందోళన

సింగిల్ నంబర్లాట నిర్వాహకుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): సింగిల్ నంబర్లాటపై సంతపేట పోలీసులు దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలో సింగిల్ నంబర్లాటను అదే ప్రాంతానికి చెందిన అమర్‌పృథ్వీ నిర్వహిస్తున్నారు. అతని కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.14,980ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. అమర్‌పృథ్వీతో పాటు కతారిపాళేనికి చెందిన రాజా, కపాడిపాళేనికి చెందిన సతీష్, ములుమూడి బస్టాండ్‌కు చెందిన రషీద్, రంగనాయకులపేటకు చెందిన జహీద్ సింగిల్ నంబర్లాటను నిర్వహిస్తున్నారనే అంశం పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు.

జర్నలిస్ట్ కాలనీలో చోరీ

- స్థానికులు కేకలేయడంతో దొంగల పరార్
- ఘటన స్థలంలో స్కూటీని వదిలెళ్లిన వైనం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు రూరల్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీలో గల ఓ ఇంట్లో ముగ్గురు దొంగలు మంగళవారం అర్ధరాత్రి చోరీ చేశారు. స్థానికులు కేకలేయడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యే క్రమంలో వారు వచ్చిన స్కూటీని ఘటన స్థలంలోనే వదిలేశారు. వివరాలు.. కొత్తూరు సమీపంలోని న్యూ జర్నలిస్ట్ కాలనీలో నివాసం ఉంటున్న నరసారెడ్డి తన కుటుంబంతో కలిసి అమెరికాకు నెల క్రితం వెళ్లారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక ముగ్గురు దుండగులు స్కూటీపై అతని ఇంటి వద్దకొచ్చారు. ప్రహరీ దూకి ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో లైట్లు వేసి ఉండటాన్ని గమనించిన పైపోర్షన్లోని వారు, స్థానికులు కేకలేశారు. దీంతో నిందితులు గోడ దూకి పరారయ్యారు. ఈ క్రమంలో చోరీ చేసిన ల్యాప్‌టాప్‌తో పాటు కొన్ని వస్తువులు అక్కడే పడిపోయాయి. నిందితుల స్కూటీ సైతం ఘటన స్థలంలోనే ఉండిపోయింది. చోరీపై వేదాయపాళెం పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. రాత్రి గస్తీ విధుల్లో ఉన్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని నిందితుల స్కూటీని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ పరిశీలించారు. ఇంట్లోని వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని సమాచారం. ఎంత మొత్తంలో సొత్తు చోరీకి గురైందనే విషయం తెలియాల్సి ఉంది. నిందితులు 25 ఏళ్లలోపు వయస్సు కలిగి.. చేతికి గ్లౌజులు ధరించి ఉన్నారని స్థానికులు తెలిపారు. స్కూటీ రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


నిందితులు వదిలెళ్లిన వాహనం

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.127
లేయర్	రూ.105
బ్రాయిలర్ చికెన్:	రూ.230
స్కిన్‌లెస్ చికెన్:	రూ.254
లేయర్ చికెన్:	రూ.178

